## ఈ వారం కథ



# అగ్నిపరీక్ష

**— సుధాకర్**

టీవీలో ప్రకటనల జోరు, హోరు పూర్తయి రామాయణం మొదలు కాబోతున్నది. పిల్లలు హోమ్ వర్కు మూసేసి, ఇంటాయన పేపరు మూసేసి, ఇంటావిడ వండినవిమూతబెట్టి, మామ్మ కళ్ళజోడు వెతుక్కొని, టీ.వి. కెదురుగా వారి వారి నిర్దిష్ట స్థానాల్లో కూర్చున్నారు. ఆ రోజు సీతమ్మ వారి అగ్నిప్రవేశ ఘట్టం. కిందటివారం మంచి పట్టులో వుండగా ఆపేశారు. తెలిసిన కథే అయినా, ఏమి జరగబోతోందో అనే ఉత్కంఠ, ఆతృత అందరిలోనూ కనిపిస్తున్నాయి. ఆఖర్న వచ్చే బట్టల సబ్బు ప్రకటన పూర్తయ్యే సరికి ఆ ఇల్లంతా నిశ్శబ్దంతో నిండి పోయింది. ఆ ఇంట్లోనే కాదు, ఆ వాడంతటా జనం తమ దైనందిన జీవన గానుగల్ని సరిదిద్దుకొని ఆ సమయాని కల్లా టీవీ రామాయణంలో మునగడానికి సిద్ధంగా వున్నారు.

పక్కింట్లోంచి తాగిన మగ గొంతుకా, సన్నని ఆడ ఏడుపూ ఒకదాన్నొకటి పెనవేసుకొని వినిపించాయి.

"మొదలయి పోయిందండీ వీళ్ల భాగోతం" అంటూ విసుక్కుంది ఇంటావిడ.

"ఏవుంది? మళ్లీ తాగొచ్చి కొడుతున్నాడు" అని సర్ది చెప్పాడు ఇంటాయన.

"పెరటి తలుపు, పక్కింటి కిటికీ మూసేయే. రోజూ ఇదో గోల ఛస్తున్నాం" ఇంటావిడ కూతురితో.

"ష్ అరవకే"అంది మామ్మ. అవిడ కసలే చెవుడు.

తలుపు, , కిటికీ మూసేసినా, పక్కింటి భాగోతం, సన్నని ఖాళీల మధ్యలోంచి దూరి, వీళ్ళ రామాయణంలో ప్రవేశించి తన పిడకల వేట సాగిస్తూనే వుంది. అయినా అందరూ తమ కళ్లూ, చెవులూ టీవీ కప్పగించి తదేక ధ్యానంతో కథలో లీనమై పోతున్నారు. కథ మంచి రక్తిగా వుంది. అగ్ని ప్రవేశం చేసే ముందు సీత తన మనో భావాల్ని సుదీర్ఘంగా వివరిస్తోంది. ఇక మంటల్లో దూకడానికి సిద్ధంగా వుంది. మామ్మకి హిందీ బొత్తిగా రాకపోయినా ఈ హృదయ విదారక సన్నివేశం ఆవిడ మసక కళ్లని కన్నీళ్ళతో పూర్తిగా మూసేసింది. ఇంటాయనతో సహా ఇంటిల్లిపాదీ కన్నీళ్ళ పర్యంతంగా ఉన్నారు. సీతమ్మవారి అవమాన భారాన్నీ, మనో ధైర్యాన్ని, త్యాగ శాంతిని చూడలేక చూడ లేక చూస్తున్నారు. పక్కింటి నుంచి తిట్లూ, ఏడుపు ఇంకా ఎక్కువ స్థాయిలో వినిపిస్తున్నాయి. వాటికి గిన్నెలూ, చెంబులూ ఎగిరిపడి దొర్లుతున్న శబ్దాలు తోడయ్యాయి.

"దొంగ లంజా, నా కిన్నిమార్లు ఎదురు జవాబిస్తావు గాని నీ బాబుకి ఒక్క ముక్క చెప్పలేవేటే? చూడు నిన్నేటి చేస్తానో ఇవాల"అన్న వాక్యం మాత్రం పూర్తిగా స్పష్టంగా వినబడింది.

ఇంటిల్లి పాదీ తీవ్రంగా విసుక్కొని, ఒక్క క్షణం మొహాలు చిట్లించి, ఆ వెంటనే సర్దుకొని. మళ్ళీ కథా గమనవేగాన్ని అందుకున్నారు. సీతమ్మవారు అగ్ని ప్రవేశం చేసేసింది. మంటల మధ్య మహా ప్రతివ్రత. దయార్థ్ర హృదయాలతో, "ఎంత ఘోరం?" అనుకుంటున్నారు.

"అయ్యా బాబో చంపేస్తున్నాడు. చంపేస్తున్నాడు. చంపే...." అన్న ఆడకేక మధ్యలోనే ఆగిపోయింది. కిరసనాయిల్ వాసన గుప్పుమంది.

"తాగు ముచ్చు లంజా కొడుకు ఇవాళేటిలా రెచ్చిపోతున్నాడు?" అన్న సందేహం ఇంటాయనకు కలిగినా, కుర్చీలోంచి లేవడానికి ఒక్క అర నిమిషం తటపటాయించాడు. సీతమ్మని మంటలు తాకలేదు. ఆవిడ పరీక్ష నెగ్గినందుకు దేవతలు పుష్ప వర్షం కురిపించి పాట పాడుతున్నారు.

పక్కింట్లోంచి, మూసిన కిటికీలు, తలుపుల్లోంచి, అడుగు మందం గోడలోంచి ఒళ్ళు జలదరింప చేసే, ఏ భాషకీ చెందని జంతు సంబంధమైన అరుపులు, మానవ మాసం మండుతున్న, జుత్తు బుగ్గవుతున్న కడుపులో తిప్పే వాసన.

రెండో రోజున పక్కింటావిడ హాస్పటల్లో ఇచ్చిన మరణ వాఙ్మూలంలో స్టౌ పగిలి చచ్చిపోయింది. ఆ రెండు రోజులూ ఇంటావిడికీ, ఇంటాయనకీ నిద్రపట్టలేదు. తిండి సహించలేదు–

"పోలీసోళ్లు అడిగితే మనకేటీ తెలీదు మనం ఏం చూడలేదు, వినలేదు." అని ఒకటికి పదిసార్లు ఒకళ్ల కొకళ్లు ధైర్యం చెప్పకొని నిద్ర మాత్రలు వేసుకునే వరకు.

వారం రోజులు గడిచిపోయాయి. అంటే టీవీలో మళ్లీ రామాయణం వచ్చే రోజు వచ్చింది. ఉదయం ఒక మహిళా సంఘం వాళ్లు– పట్టుమని పాతిక మంది కూడా లేరు– వరకట్న హంతకుల్ని అరెస్టు చెయ్యాలని నినాదాలిస్తూ వర్షంలో కలెక్టరాఫీసు దాకా వెళ్తే, అనుమతి లేనందుకు పోలీసు వాళ్లు వాళ్ళని లాఠీల్తో చితకబాది ఒక కాలేజీ కుర్రాడ్నీ, ఇద్దరమ్మాయిల్నీ పట్టుకు పోయారు.

అదే రోజు రాత్రి ఆ వాడలో ఎవరూ ఊహించని ఘోరాతి ఘోరం జరిగిపోయింది. రామాయణం మొదలు కాబోతుండగా కరెంటు పోయింది. వాడ వాడంతా కోపంతో విజృంభించి విలయ తాండవం చేసింది. అసలే చికాగ్గా వున్న ఇంటాయనతో సహా సుమారు నూట యాభైమంది యువకులూ, నడి వయస్కులూ అప్పటి కప్పుడు జంక్షన్ దగ్గర గుమిగూడి ఆ వెంటనే దగ్గర్లో వున్న సబ్ స్టేషన్ మీద దాడిచేశారు. అద్దాలు పగల గొట్టారు. లైన్ మన్‌ల కాలర్లు పట్టుకొని గద్దించారు. అసిస్టెంట్ ఇంజినీర్ గారి స్కూటర్నీ ధ్వంసం చేశారు. అక్కడే వెలుగుతూవున్న కొవ్వొత్తులతో ఫైళ్ళకు నిప్పపెట్టబోతూ ఉండగా కరెంటు వచ్చేసింది. అందరి నోటి వెంటా అప్రయత్నంగా ఒకేసారి 'హా...ఆ...ఆ...' అనే శబ్దం వెలువడింది. నవ్వుకుంటూ ఒకళ్ళనొకళ్ళు తోసుకుంటూ అంతా ఇళ్ళకి పరుగెత్తారు.



## నవలలమ్మే యంత్రం

నాణాలు వేస్తే సిగరెట్ పెట్టెలు బయటకి పంపే యంత్రం రాకమునుపే పెన్‌గ్విన్ పబ్లిషింగ్ సంస్థ నవలలు అమ్మే డిస్‌పెన్సింగ్ యంత్రాన్ని ప్రవేశపెట్టింది. 1937లో లండన్‌లోని బేరింగ్ క్రాస్‌రోడ్‌లో ఈ యంత్రాన్ని వుంచింది. బేరింగ్ క్రాస్‌రోడ్ నిండా పుస్తకాల దుకాణాలే కాబట్టి ఈ యంత్రాన్ని అక్కడ వుంచారు. అయితే ఈ యంత్రానికి రోజులో 24 గంటలూ, మిగతా షాపులు మూసి వున్నప్పుడు కూడా అమ్మే సౌకర్యం వుండేది.

— యం. లిపి



## అదండీ వ్యాపారమంటే!

అర్ధరాత్రయినా, అపరాత్రయినా రోడ్డు మీదకెళ్ళిన స్త్రీలు ఇంటికొచ్చే వరకు ఆందోళనగానే వుంటోంది. నగరాల్లో ఈ భయం మరీ హెచ్చు. అడుగడుగునా అడ్డం పడే ఆపదలు ఎన్నో. అయితే 'క్యాప్‌స్టన్' వుండగా మీ చెంత – ఏలమీకు చింత? అంటున్నారు అమెరికా వారు. బయిటికెళ్లినప్పుడు మోసగాళ్ళో, దొంగలో తారసపడినపుడు ఆ బాటిల్‌కున్న చిన్న మీటను నొక్కితే చాలు. అందులోని ద్రవం ఎదుటివారి కళ్ళలో పడి తాత్కాలికంగా కళ్ళు కనపడకుండా చేసి అయోమయం కలిగిస్తుంది. అంతేకాదు చర్మం ఒక్కసారిగా మండుతుంది. తెరలు తెరలుగా దగ్గొస్తుంది. ఈలోగా మనం తప్పించుకోవచ్చునని వేరే చెప్పనక్కర లేదనుకుంటాను. ఇంతకీ ఆ సీసాలో వున్న ద్రవం ఏమిటో తెలుసా? మిరియాల నూనె. దాని ఖరీదు మన కరెన్సీలో రెండువేల వంద రూపాయలు!

సేకరణ:
మావూరు.విజయలక్ష్మి